క్లుప్తంగా

పాతనేరస్తులకు కౌన్సెలింగ్‌



జగ్గయ్యపేట అర్బన్‌: జగ్గయ్యపేట పట్టణం, చిల్లకల్లు మండల పోలీస్‌ స్టేషన్ల పరిధిలో ఉన్న పాత నేరస్తులకు జగ్గయ్యపేట పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ గతంలో పరిసరాల ప్రభావం, చెడు స్నేహితుల ప్రభావం, ఆర్థిక ఇబ్బందులు, ఇతర ఒత్తిడులతో కారణంగా గతంలో నేరాలకు పాల్పడి ఉంటారన్నారు. అందుకు తగిన శిక్షలు అనుభవించారని వివరించారు. మంచి ప్రవర్తనతో మెలగడం ద్వారా మంచి భవిష్యత్‌ కలిగి కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండవచ్చునని వారికి సూచించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

300 మందికి వైద్యపరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్‌: జగ్గయ్యపేట మెడికల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉక్కు కళావేదికలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మున్సిపల్‌ చైర్మన్‌ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ నియోజకవర్గ సమన్వయక కమిటీ సభ్యులు శ్రీరాం చినబాబు పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. విజయవాడ మణిపాల్‌ హాస్పిటల్‌ వైద్య బృందం 300 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలకు క్యాన్సర్‌ పరీక్షలు, పురుషులకు గుండె సంబంధిత పరీక్షలు ఉచితంగా చేశారు. మెడికల్‌ అసోసియేషన్‌ ప్రతినిధి సీహెచ్‌. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ శిబిరంలో అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి గరుడ సేవ




వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారి గరుడ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను గరుడవాహనంపై ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వేదాంతం శేషాచార్యులు మాట్లాడుతూ లోకకళ్యాణార్థం స్వామి వారికి గరుడసేవ నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌ బియ్యం తరలిస్తున్న వాహనం స్వాధీనం

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని జక్కంపూడి కాలనీలో ఆదివారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా రేషన్‌ డిపో నుంచి బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలోని బ్లాక్‌ నెం 245 రేషన్‌ డిపో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నంబర్‌ ప్లేట్‌ లేని వ్యాన్‌లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సెక్టార్‌ ఎస్‌ఐ హుటాహుటిన కాలనీకి చేరుకునే సరికి బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌ నిండా బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వ్యాన్‌ డ్రైవర్‌ను వివరాలు అడిగినా సమాధానం చెప్పక పోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పాలప్రాజెక్టు క్వార్టర్స్‌లోని పోలీస్‌స్టేషన్‌కు చెందిన స్థలంలో భద్రపర్చారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు కళాకారిణులు నృత్య నీరాజనాలను అర్పించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీతాండవ నృత్య, డ్యాన్స్‌, మ్యూజిక్‌ అకాడమీకి చెందిన జానకీ మోహన్‌రావు, విజయ్‌ల పర్యవేక్షణలో చిన్నారులు నయన శిఖర, అన్నపూర్ణ, పూజిత, దీక్షిత, సిరి లిఖిత, సిద్ధిక్ష, నిక్షిత, జాశ్రీత, శ్రీశాన్విలతో పాటు మరి కొంతమంది పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్‌: ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి, శ్రీనివాస నాట్యమండలి యూనిట్‌ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళావేదికపై రెండురోజులుగా నిర్వహిస్తున్న పద్య నాటికలు ఆదివారం ముగిశాయి. కలియుగ నాథుడు శ్రీనివాసుని లీలలు వర్ణిస్తూ కలియుగ వైకుంఠం నాటకం, తిరుపతి వెంకటకవులు రచించిన పాండవ ఉద్యోగ విజయాల్లోని పడక సీను, చిలకమర్తి లక్ష్మీనరసింహపంతులు రచించిన గయోపాఖ్యానంలోని సన్నివేశాలను ప్రదర్శించారు. దత్తుబాబు, ప్రసాద్‌బాబు, బుజ్జి సాహెబ్‌, సోని, ఆంజనేయులు, దాసుబాబు నటించారు.

సిద్ధమవుతున్న పందెం బరులు

- బోడవాడలో కోడిపందేలు ప్రారంభం
- అటువైపు కన్నెత్తిచూడని పోలీసులు



వీరులపాడు మండలం బోడవాడలో సిద్ధం చేస్తున్న కోడి పందేల బరి

వీరులపాడు: సంక్రాంతి పండుగకు పందెంకోళ్ల కాలుదువ్వేందుకు సిద్ధమవుతుండగా..పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు.. పోలీసులు మాత్రం కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం..బరులను ధ్వంసం చేస్తాం అంటూ యథావిధి ప్రకటనలు చేస్తున్నారు. కోడిపందేల నిర్వాహకులు మాత్రం పండుగకు పదిరోజులు ముందుగానే పందేలు ప్రారంభిస్తూ పోలీసుల వ్యాఖ్యలు కేవలం ప్రకటనలకే పరిమితమనే సంకేతాలు ఇస్తుండటం గమనార్హం.

సంక్రాంతి పండుగకు కోడిపందేలు నిర్వహించేందుకు నందిగామ నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాల పరిధిలో పందెం బరులు సిద్ధమవుతున్నాయి. వీరులపాడు మండలంలో అయితే ఒకడుగు ముందుకేసి బరులు సిద్ధంచేసి పందేలు కూడా నిర్వహిస్తున్నారు. మిగిలిన నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లో మాత్రం ఆయా గ్రామాల శివారులోని మామిడి తోటల్లో బరులు ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పండుగ మూడు రోజులు చూసీ చూడనట్లు వ్యవహరించే పోలీసు అధికారులు, ఈసారి పండుగకు పదిరోజులు ముందు నుంచే పందేలు నిర్వహిస్తున్నా కనీసం ఆవైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోతున్నారనే వ్యాఖ్యలు జనం నుంచి వినిపిస్తున్నాయి.

బోడవాడలో జోరుగా పందేలు..

మండలంలోని బోడవాడ గ్రామంలో ఆదివారం నుంచి కోడి పందేలు ప్రారంభించారు. గ్రామ శివారులోని మామిడి తోటలో బరులు ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మద్యంతోపాటు అన్నిరకాల ఏర్పాట్లు చేసి పందేలు నిర్వహిస్తున్నా పోలీస్‌, రెవెన్యూ తదితర శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తగ్గేదేలే అంటున్న నిర్వాహకులు..

వీరులపాడు మండలంతోపాటు నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లోని ఆయా గ్రామాల్లో కోడి పందేలకు బరులు సిద్ధమవుతున్నాయి. కంచికచర్ల మండలంలో గండేపల్లి గ్రామసమీపంలో కీసర గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు 15ఎకరాల మామిడి తోటలో పందేలు నిర్వహించేందుకు బరి సిద్ధం చేస్తుండటం గమనార్హం.

ప్రేక్షకపాత్రలో పోలీసులు..

పదుల ఎకరాలలో ఒక్కో బరి సిద్ధమవుతున్నా వాటిని ధ్వంసం చేసే విషయంలో మాత్రం పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పాలకుల ఒత్తిడి కారణంగా పందెం బరులు ధ్వంసం చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారా లేక నిర్వాహకులు కాసులు ముట్టచెబుతుండటంతో మిన్నకుండిపోతున్నారోననే వ్యాఖ్యలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నా పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితమవ్వడం అనుమానాలకు తావిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్‌, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు స్పందించి బరులను ధ్వంసం చేసి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

వత్సవాయి: మండలంలోని కంభంపాడు పంచాయతీ శివారు రెబ్బవరంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహశీల్దార్‌ ఎస్‌.నరసింహరావు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు ఐదు గంటల వరకు సదస్సు కొనసాగుతుందన్నారు. భూసంబంధిత సమస్యలపై రైతులు అర్జీలు అందజేస్తే, పరిశీలించి పరిష్కరిస్తామని వివరించారు. ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కంచికచర్ల తహసీల్దార్‌ పి.జాహ్నవి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

ముగిసిన సామవేదం ప్రవచనాలు

విజయవాడ కల్చరల్‌: ఋషిపీఠం విజయవాడ, భారతీయ సనాతన వేదిక ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య కళాశాలలో తొమ్మిది రోజులుగా మన కోసం మన పురాణాలు అంశంగా నిర్వహిస్తున్న ప్రవచనాలు ఆదివారం ముగిసాయి. సామవేదం షణ్ముఖశర్మ మాట్లాడుతూ పురాణాలు నేటి కాలానికి అందనప్పటికీ అవి నిత్యనూతనాలు అని వివరించారు. మన పురాణాలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయన్నారు. ఆగమ శాస్త్రంలోని అనేక అంశాలు మన పురాణాల్లో కనిపిస్తాయన్నారు. వాస్తు విజ్ఞానం గురించిన అనేక అంశాలను వివరించారు. వివిధ పురాణాల్లో పరమేశ్వరుని రూపాలు, నామాలు వివరిస్తూ ఈశ్వర శక్తి ఏవిధంగా ఉంటుందో తెలిపారు. సాహితీవేత్త కప్పగంతు రామకృష్ణ నిర్వహించారు. పాటిబండ సుందరరావు, ఆలమూరి శ్రీనివాస్‌, తొండెపు రత్నశ్రీనివాస్‌లు సామవేదాన్ని ఘనంగా సత్కరించారు.

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

జగ్గయ్యపేట: సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండటంతో సమరానికి పందెం కోళ్లు సై అంటున్నాయి. పందేలు వేసేందుకు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం కొన్ని గ్రామాల్లో కోడిపుంజులకు కొన్ని నెలలుగా శిక్షణ ఇస్తున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం ఖమ్మం, గుంటూరు, కృష్ణా, నల్గొండ జిల్లాల సరిహద్దుల్లో ఉండటంతోపాటు అటవీప్రాంతం కూడా అధికంగా ఉండటతో కోడిపందేలకు నిర్వాహకులు ఈప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు.తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా ఈ ప్రాంతానికి ఎక్కువగా పందెం కోళ్లు వస్తున్నట్లు సమాచారం.

పోలీసులకు సవాల్‌గా మారిన పందేలు..

నియోజకవర్గంలో కోడి పందాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో పందెం నిర్వాహకులు విచ్చలవిడిగా పందేలు నిర్వహిస్తుంటారు. కొన్ని గ్రామాల్లో పందేలు వేసేందుకు ప్రత్యేకంగా మైలా, కాకిడేగ, పచ్చకాకి, సితువా వంటి కోళ్లను ప్రత్యేకంగా పెంచుతున్నట్లు సమాచారం. వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లోని పలు గ్రామాలలో రెండుజాతుల పందెం కోళ్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కూడా సమాచారం. ఈ కోళ్ల కోసం ఓ శిక్షకుడిని ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిసింది. కోడిపందేల నిర్వాహకులు పందేల నిర్వహణకు బరులను సిద్ధంచేసుకునేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులను ప్రసన్నం చేసుకునేందుకు వారిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా సర్కిల్‌ పరిధిలో కోడి పందేలు నిర్వహించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందేల సమాచారాన్ని తమకు తెలియజేయాలని ప్రజలను కోరారు. పందేలు సాగకుండా చేసేందుకు ఇప్పటికే ఓ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు సీఐ వివరించారు.

ఊపందుకున్న వరినాట్లు

- రబీపై గంపెడాశతో అన్నదాతలు
- కూలీలకు పెరిగిన డిమాండ్‌



అనిగండ్లపాడులో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



పెనుగంచిప్రోలులో వరినాట్లు వేస్తున్న కూలీలు



వరినారు కట్టలు కడుతున్న కూలీలు

పెనుగంచిప్రోలు: రబీ సీజన్‌ ముమ్మరంగా సాగుతోంది. రైతులు బోరులు, బావుల కింద ఇప్పటికే నాట్లు వేస్తున్నారు. చెరువులు, మునేరుకు నీరు వస్తుండటంతో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన రైతులు దమ్ములు చేస్తున్నారు.

3వేల హెక్టార్లలో సాగు..

నియోజకవర్గంలో సుమారుగా 3వేల హెక్టార్లలో రబీ వరిసాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. కూలీలకు ఈసీజన్‌లో డిమాండ్‌ బాగా పెరిగింది. ప్రస్తుతం మిర్చి కోతలు కూడా ముమ్మరంగా సాగుతుండటంతో కూలీలకు కూడా డిమాండ్‌ విపరీతంగా పెరిగింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా కూలీలను రప్పిస్తున్నారు. ఎకరా నాటుకు రూ.4600 ఎకరానికి నాట్లు వేసేందుకు గతంలో రూ.4వేల నుంచి రూ.4,200 కాగా, ప్రస్తుతం ఎకరానికి రూ.4,500 నుంచి రూ.4,600 వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. ఈఏడాది ఖరీఫ్‌లో తుఫాన్‌ ప్రభావంతో రైతులు దారుణంగా నష్టపోయారు. వేసిన పంట కొట్టుకు పోవడంతోపాటు ఇసుక మేటలు వేయడం, భూములు కోతలకు గురికావడంతో రైతులు తీరని నష్టం వాటిల్లగా, ఉన్న కొద్ది పంటను కాపాడుకోవటానికి రైతులు పాట్లు పడ్డారు. దిగుబడులు సైతం బాగా తగ్గాయి. రబీలో అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంగా రైతులు ముందుకుసాగుతున్నారు.

సాయం కోసం ఎదురుచూపులు....

గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో అందించిన రైతుభరోసా కారణంగా పెట్టుబడులకు రైతులకు పెద్దగా ఇబ్బంది లేకుండా పోయింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, కావాల్సిన విజ్ఞానాన్ని అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు ఏడాదికి ఇస్తానన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఖరీఫ్‌లో అందలేదు. ఇటీవల నిర్వహించిన కేబినేట్‌ భేటిలో సైతం రైతులకు సాయంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ఈ రబీలోనూ పెట్టుబడి సాయం అందేపరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. త్వరితగతిన పెట్టుబడి సాయం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రబీపై ఆశతో..



ఖరీఫ్‌ సీజన్‌ రైతులను దారుణంగా ముంచింది. రబీ అయినా కలిసొస్తుందనే ఆశతో సాగు చేపట్టాం. నాట్లు వేయటానికి కూలీల ఖర్చులు కూడా పెరిగాయి. దిగుబడులు బాగా వస్తేనే గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కూడా అందించాలి.

-గంగూరి ప్రసాద్‌, రైతు, అనిగండ్లపాడు

సూచనలు పాటించాలి..



రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలి. విత్తన శుద్ధి వలన రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. మోతాదుకు మించి కూడా ఎరువులు వాడకం మంచిది కాదు. రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రామసుబ్బారెడ్డి, పెనుగంచిప్రోలు మండల వ్యవసాయాధికారి

సామాజికసేవలో వాసవీ క్లబ్‌ ముందంజ



నూతన కార్యవర్గసభ్యులతో ప్రభుత్వ విప్‌ టి.సౌమ్య

నందిగామటౌన్‌: సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో వాసవీ క్లబ్‌, అనుబంధ క్లబ్‌లు ఎప్పుడూ ముందుంటాయని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక బాబూ జగ్జీవన్‌రాం భవన్‌లో వాసవీ క్లబ్‌, అనుబంధ క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా వాసవీమాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్‌ సౌమ్య మాట్లాడుతూ క్లబ్‌ ఆధ్వర్యంలో రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం కొప్పు మురళీకృష్ణ, పబ్బతి కిషోర్‌, కేతేపల్లి సత్యం బాబు, పులిపాటి వెంకటేశ్వరరావు, మారం వెంకటేశ్వరరావు, కేతేపల్లి ఆంజనేయులతోపాటు కార్యవర్గ సభ్యులతో వాసవీ ఇంటర్‌నేషనల్‌ కార్పొరేట్‌ పరిపాలన ఉపాధ్యక్షుడు నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు, క్లబ్‌ జిల్లా గవర్నర్‌ తునుగుంట్ల శ్రీధర్‌, జిల్లా అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో యేచూరు రాము, సాయిరాం, రామచంద్రరావు, మారం రాజారావు, దుద్దు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

నందిగామటౌన్‌: స్థానిక శ్రీవిద్యా పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలలో విద్యార్థులు, వారి తల్లులు పాల్గొని అందమైన రంగవల్లులను దిద్దారు. ఈ సందర్భంగా శ్రీవిద్యా పాఠశాల చైర్మన్‌ కందుల మల్లికార్జునరావు మాట్లాడుతూ తెలుగువారు జరుపుకునే పండుగలలో అతి పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయని వివరించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ చిన్నజోస్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళలు, విద్యార్థులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభ కార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడితోటల్లో సేద తీరారు. అమ్మవారి నిత్యకల్యాణం కార్యక్రమంలో భక్తులు పాల్గొని తిలకించారు.



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



బోనాలతో శ్రీతిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సుబాబుల్‌ ట్రాక్టర్‌ బోల్తా



బోల్తాపడిన సుబాబుల్‌ ట్రాక్టర్‌

గోకరాజుపల్లి(వీరులపాడు): సుబాబుల్‌ ట్రాక్టర్‌ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని బోడవాడ గ్రామానికి చెందిన గండ్రాల స్వామి ఆదివారం తాటిగుమ్మి గ్రామం నుంచి సుబాబుల్‌ లోడుతో కాటా వేయించేందుకు వెల్లంకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గోకరాజుపల్లి గ్రామ శివారులోకి వచ్చేసరికి ట్రాక్టర్‌ అదుపు తప్పి బోల్తా పడటంతో అప్రమత్తమైన డ్రైవర్‌ కిందకు దూకాడు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై పడిన సుబాబుల్‌ కర్రను గ్రామస్తులు తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.